

పూర్వ వైభవం చేకూరేనా?

- రజతోత్సవ సభపై బీఆర్‌ఎస్ ఆశలు
- నేడు కరీంనగర్‌లో సన్నాహక సమావేశం
- కేటీఆర్, హరీష్‌రావు రాక



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)
బీఆర్‌ఎస్ పార్టీ పూర్వవైభవ సాధన కోసం తహతహ లాడుతోంది. పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభను భారీ ఎత్తున నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీశ్రేణులను, ప్రజలను సభకు హాజరయ్యేలా చూసి రాష్ట్రంలో తనపట్టు ఏమాత్రం సడలిపోలేదని చాటి చెప్పాలనుకుంటున్నది. ఏప్రిల్ 27న వరంగల్‌లో ఈ సభను నిర్వహించతలపెట్టిన పార్టీ నాయకత్వం దానికి ముందస్తుగా కరీంనగర్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నది. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు, రజతోత్సవ ఇన్‌చార్జి, మాజీ మంత్రి హరీష్ రావు ఈ సమావేశానికి హాజరై పార్టీనేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగుజిల్లాల నుంచి సుమారు ఐదువేల మంది కార్యకర్తలు, నాయ కులు ఈ సమావేశానికి హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అధినేత కేసీఆర్‌కు వెన్నంటి ఉంటూ వచ్చి ఉద్యమకాలంలో, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలోనూ ప్రతి కీలకమలుపులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆయనకు అండగా నిలిచి సెంటిమెంట్ జిల్లాగా మారింది. రాష్ట్రాన్ని సాధించిన తర్వాత రెండుసార్లు అధికారంలోకి రావడంలో ఉమ్మడి జిల్లా కీలక పాత్ర వహించింది. ప్రతి ఎన్నికలోనూ జిల్లా నుంచి 12 మంది ఎమ్మెల్యేలు ఎన్నికై వచ్చి కేసీఆర్‌కు అండగా నిలిచారు.

● పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని..

మూడోసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఈ జిల్లా బీఆర్‌ఎస్‌కు ప్రతికూల ఫలితాలను ఇచ్చింది. ఐదు స్థానాల్లో మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఆ తర్వాత పరిణామాల్లో జగిత్యాల శాసనసభ్యుడు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం ఈ పార్టీకి ఉమ్మడి జిల్లా పరిధిలో నలుగురు శాసనసభ్యులు మాత్రమే ఉన్నారు. కేసీఆర్‌కు సెంటిమెంట్ జిల్లాగా చెప్పుకునే ఈ జిల్లాలో ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గంలో ఎన్నికలు జరిగాయి. పార్టీ అభ్యర్థిని పోటీలో నిలుపకుండా దూరంగా ఉన్నది. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని నిలుపకపోవడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. పార్టీ బలహీనపడడంతోనే ఎన్నికలకు దూరంగా ఉందనే భావన రాజకీయవర్గాల్లోనే కాకుండా ప్రజల్లోకి కూడా వెళ్లింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న రెండు ఎంపీ స్థానాల్లో ఒక స్థానాన్ని బీజేపీ, మరోస్థానాన్ని కాంగ్రెస్ దక్కించుకున్నాయి. బీఆర్‌ఎస్ రాజకీయాలకు గుండెకాయగా పేర్కొనే కరీంనగర్ జిల్లాలో ప్రస్తుత పరిస్థితి ఆ పార్టీశ్రేణులను మానసికంగా వేదనకు గురిచేస్తున్నది. మరో ఒకటిరెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయన్న సంకేతాలు వస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ సంస్థాగత నిర్మాణాలను పటిష్ట పరుచుకుంటున్నాయి. గ్రామస్థాయిలో, పోలింగ్ బూత్‌స్థాయిలో కమిటీలను వేసుకొని ప్రజల్లోకి చొచ్చుకువెళ్తున్న నేపథ్యంలో పార్టీ యంత్రాంగాన్ని పటిష్టపరిచి వారిలో ఉత్సాహం నింపడం అవసరమని బీఆర్‌ఎస్ అధిష్టానం భావిస్తున్నది. ఈ నేపథ్యంలోనే వరంగల్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపాలని, దానికి లక్షలాది మందిని తరలించడం ద్వారా బీఆర్‌ఎస్ పట్టుచెదరలేదనే సంకేతాలివ్వాలని పార్టీ భావిస్తున్నది. దానికి జిల్లాలో సన్నాహక సమావేశం నిర్వహించి వారందరిని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనాన్ని తరలించేందుకు కార్యోన్ముఖులను చేయాలని పార్టీ నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో ఈ సభ ద్వారా ఉత్సాహం నింపి దానిని స్థానిక

(మిగతా 8వ పేజీలో)

● ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే 'గంగుల'

కరీంనగర్ టౌన్: నగరంలోని బైపాస్ రోడ్డు వీ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్‌ఎస్‌పార్టీ సిల్వర్‌జూబ్లీ వేడుకల సన్నాహక సమావేశ ఏర్పాట్లను ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ పరిశీలించారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి కరీంనగర్ నియోజకవర్గ పరిధి నుంచి పార్టీశ్రేణులు, నాయకులు, అభిమానులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ తర్వాత వివిధ కోర్సులు
● విద్యార్థులకు 113 కోర్సులను సూచించిన సీబీఎస్ఈ
7
ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి
● జిల్లా భూగర్భ జలాధికారి శ్యాంప్రసాద్‌లాల్
8
వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రభుత్వాలను మార్చే సత్తా రైతులకు ఉంది

- ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కనపెట్టి ఆదుకుందాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

జమ్మికుంట రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలను మార్చే సత్తా రైతులకు మాత్రమే ఉందని కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతిపై కిసాన్ మేళా శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డ చరిత్ర లేదన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. రైతులే ఉత్పత్తి దారులుగా మారి సంఘాలుగా ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో భారత దేశ పత్తికి డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్నారు. అధిక సాంద్రత విధానంతో మొక్కల మధ్య దూరం తక్కువ చేసి నాటడం వల్ల ఎక్కువ మొక్కలు ఉండి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను చైతన్య పరిచే విధంగా సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెస్తుందని వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన అను ప్రయోగ సంస్థ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలకు డ్రోన్‌లను అందించి శిక్షణ ఇవ్వడం ద్వార మహిళ రైతులకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి



నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

తిమ్మాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటి వృథాను పూర్తిగా అరికట్టాలని, ప్రతి వర్షం నీటి చుక్కను ఒడిసి పట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని మిషన్ భగీరథ కార్యాలయ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ సహకారంతో శనివారం ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ మనుగడకు నీటి లభ్యత కోసం వెతకాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ప్రతి ఇంట్లో వర్షాధార నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా మరిన్ని చెక్ డ్యాములు, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన విలువైన తాగు నీటిని సరఫరా చేస్తున్నామని, ఈ నీటిని వృథా చేయవద్దని సూచించారు. మిషన్ భగీరథ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో ప్రజల ముందే నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ఎక్కడైనా లోపాలు ఉంటే గుర్తించి సరి చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, సరఫరా చేసే పైపుల నుంచి నీరు వృథా కాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ రాములు, ఈఈలు అంజన్‌రావు, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

● 'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కరీంనగర్ టౌన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె నగరంలోని ప్రభుత్వ పురాతన పాఠశాల, ధన్గర్‌వాడీ, వాణినికేతన్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, కాలిక్యులేటర్లు అనుమతించవద్దన్నారు.

● 14 మంది గైర్హాజరు

శనివారం నిర్వహించిన పదో తరగతి ద్వితీయభాష పరీక్షకు 14 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, 12,491 మంది పరీక్షలు రాశారు. ఏడుగురు ప్రైవేట్ విద్యార్థులకుగాను ముగ్గురు గైర్హాజరు కాగా నలుగురు పరీక్షలు రాశారు. జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశామని డీఈవో జనార్దన్‌రావు తెలిపారు.

అకాల వర్షం.. నేలవాలిన పంటలు


చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో నేలవాలిన మక్కను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి


రామడుగు మండలం దేశరాజుపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న


చెర్లబూత్కూర్‌లో నెలవాలిన మొక్కజొన్న పంట

జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు అకాల వర్షం కురిసింది. దీంతో పలు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, వరి నేల వాలింది. వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించి దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

కరీంనగర్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంటలు నేలమట్టమయ్యాయి. పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలవాలగ.. వరి పంట దెబ్బతింది. పొట్టదశకు వచ్చిన వరి పంట నేలరాలింది. నగునూర్ గ్రామంలో తోంటి గంగయ్య, ముత్యాల గణేష్, ఈగుర్ల కొమురయ్య, గాండ్ల హరీష్, తొంటి బీరయ్య సాయిల్ల శ్రీనివాస్‌ల మొక్కజొన్న పంట నేలవాలింది. పిడుగు పాటుకు నగునూర్ గ్రామంలోని 45 స్ట్రీట్‌లైట్లు కాలిపోయాయి. కరీంనగర్ మండలంలో మొక్క జొన్న 97 ఎకరాలు, 18 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. నేలవాలిన పంటలను శనివారం కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి పరిశీలించారు. నష్టపోయిన పంటలను ఎంఏవో బి సత్యం, వ్యవసాయ అధికారులు సర్వే చేశారు.

● రామడుగు: అకాల వర్షానికి మండలంలో పలు గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలింది. పందికుంట గ్రామానికి చెందిన రైతు నిట్టు గంగరాజుకు సంబంధించిన రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్నది. దేశరాజుపల్లిలో 50 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. ఇదే గ్రామానికి చెందిన కాస్తపాక నరసయ్య ఇంటి ముందు వేసిన రేకులు లేచిపోయి జిల్లెల సురేష్ ఇంటి మీద పడగా పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్నది. రామడుగు, వెదిర గ్రామాల్లో వడగళ్ల వర్షం కురిసింది.

● చొప్పదండి: అకాల వర్షం అన్నదాతను అతలాకుతలం చేసింది. మరి కొద్ది రోజుల్లో చేతికి అందే పంట నేలవాలిపోయి నష్టాన్ని తెచ్చిపెట్టింది. మండలంలోని రుక్మాపూర్, కాట్నపల్లి, కొలిమికుంట, చొప్పదండిలో మొక్కజొన్న పంటకు నష్టం జరిగింది. అధికారులుం 40 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేయగా దాదాపు 200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు సమాచారం. చొప్పదండిలో అకాల వర్షానికి వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన మక్కలను, దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరిశీలించారు. వెంటనే రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రుక్మాపూర్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ, మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ పరిశీలించారు. కొలిమికుంటలో పంటలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.


నగునూరులో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన బండి సంజయ్‌కుమార్


నగునూరులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ రూరల్: మండలంలో అకాల వర్షం కారణంగా రులవాలిన పంటలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. రైతులను పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటలకు నష్టపరిహారం రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా

- నిబంధనలు పాటించని వారిపై చర్యలు
- ప్రత్యేక కమిటీ ద్వారా నిరంతర తనిఖీలు



సుభాష్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్కానింగ్ సెంటర్లు, ఫర్టిలిటీ సెంటర్లపై నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో డీఎంహెచ్‌వో, పీవో డీటీటీ, డీటీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి, సఖి కేంద్రం కన్సల్టెంట్, ఏఎస్ఐ, ఎన్‌జీవో సభ్యులు, డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారు. స్కానింగ్ కోసం వచ్చిన వారి వివరాలను నమోదు చేసే రిజిస్టరు వినియోగిస్తున్నారా.. లేదా, సెంటర్‌కు పీసీపీఎన్‌డీటీ జిల్లా అప్రో ప్రియేట్ అథారిటీ కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, అందులో పనిచేస్తున్న డాక్టర్ల అర్హతలను పరిశీలిస్తారు.ధరల పట్టిక ఏర్పాటు, రికార్డుల నిర్వహణ, ప్రతినెలా స్కానింగ్‌ల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పంపిస్తున్న తీరును పరిశీలిస్తారు. నిబంధనలు పాటించని వాటిపై చర్యలకు వైద్యశాఖ అధికారులకు సమాచారం అందిస్తారు.

● 15 స్కానింగ్ సెంటర్లకు నోటీసులు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 195 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. అందులో 53 మూతపడ్డాయి. 142 స్కానింగ్ సెంటర్లు కొనసాగుతున్నాయి. వాటిలో 59 స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని 15 స్కానింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు.

● లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994, రూల్స్-1996 అమలవుతున్న తీరు, గర్భస్థ శిశువుగా ఉన్నపుడు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరం అనే బోర్డులు స్కానింగ్ సెంటర్లలో ఏర్పాటు చేసేలా చూస్తారు. ఒకవేళ పరీక్షలు చేసినట్లు రుజువైతే పరీక్షలు చేసినవారికి, చేయించుకున్నవారికి, ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు
- డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌వో

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకు 59 స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశాం.అందులో నిబంధనలు పాటించని 15 సెంటర్లకు నోటీసులు జారీ చేశాం.స్కానింగ్ సెంటర్ల తనిఖీ నిరంతరం కొనసాగుతుంది. అన్ని సెంటర్లు తప్పనిసరిగానిబంధనలు పాటించాలి. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటాం.


కమాండ్ కంట్రోల్ సెంటర్ గో లైవ్ ప్రారంభం

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ గో లైవ్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రారంభించి పరిశీలించారు. శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ గో లైవ్‌ను ప్రారంభించి ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌లో అన్ని ప్రాజెక్టుల ఇన్‌స్టాలేషన్ పూర్తి చేసినందుకు టీంను అభినందించారు. కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రతినిధి నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై 25శాతం రిబేట్

- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై కల్పించిన 25శాతం రిబేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో సూచించారు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకుని వెయ్యి రూపాయల చార్జీలు చెల్లించిన వారు 31లోగా 25శాతం రిబేట్‌తో పూర్తిచార్జీలు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా క్రమబద్ధీకరించుకున్న దరఖాస్తుదారులకు సంబంధిత ప్రొసీడింగ్స్ పత్రాలను కూడా వెంటనే జారీ చేస్తామన్నారు.



మద్యం మత్తులో వాహనాలు నడిపిన 41మందికి జైలు శిక్ష

వేములవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన 91మంది మందుబాబులకు వేములవాడ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి జైలుశిక్ష, జరిమానా విధించి నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. గత 14రోజుల వ్యవధిలో జరిపిన వాహనాల తనిఖీ సందర్భంగా మద్యం సేవించి పట్టుబడిన వారిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టామని, వీరిలో ఇద్దరికి ఏడు రోజులు జైలు శిక్ష, ఏడుగురికి మూడు రోజులు జైలు శిక్ష, ఐదుగురికి ఐదు రోజులు జైలు శిక్ష, 27 మందికి రెండు రోజుల జైలు శిక్ష, మిగతా 50 మందికి జరిమానా విధించారని ఆయన వెల్లడించారు.

గిరిజన మహిళలకు రూ.20 వేల జరిమానా

ఎల్లారెడ్డిపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించిన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ తండాకు చెందిన గిరిజన మహిళకు జ్యోతికి తహసీల్దార్ సుజాత రూ.20 వేల జరిమానా విధించారని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. తండాకు చెందిన గిరిజన మహిళ జ్యోతి గతంలో సారా తయారు చేస్తూ పట్టుబడగా తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో ఆమెకు రూ.20 జరిమానా విధించారని చెప్పారు. సారా తయారీ, అమ్మకాలు సాధించడంతో పాటు బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు కార్మికుల వెట్టి చాకిరి

- వేతనంలో రూ.4500 కోత
- అడిగితే ఉద్యోగం నుంచి తొలగింపు.
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు



కళ్యాణ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా వేతనంలో రూ.4568కోత విధిస్తున్నట్లు కార్మికులు ఆరోపించారు. మెడకల్ కళాశాలలో 75 పారిశుధ్య, సెక్యూరిటీ పోస్టులకుగాను 42మంది విధుల్లో ఉన్నారు. ఎలైన్ ఏజెన్సీ ఈ కాంట్రాక్టును దక్కించుకున్నది. ఇందులో 22మంది శానిటేషన్ విభాగంలో, సెక్యూరిటీ విభాగంలో 23మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి వేతనం రూ.16500లకుగాను రూ.875 పీఎఫ్, రూ.52 ఈఎస్ఐకి జమ అవుతుండగా మిగితా రూ.15,573 రావాల్సి ఉండగా రూ.11005 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. రూ.4568 ఎందుకు కోత విధిస్తున్నారో కాంట్రాక్టర్ చెప్పడం లేదు. అంతేకాకుండా కార్మికులపై కూడా పని భారం మోపుతున్నారు. నలుగురు పని చేసే చోట ఇద్దరితో పని చేయిస్తు న్నారు. కళాశాలలో మూడు షిఫ్టుల్లో 42మంది మాత్రమే పని చేస్తున్నారు. ముగ్గురు సూపర్‌వైజర్ విధులు నిర్వ హించాల్సి ఉండగా ఇద్దరితోనే నెట్టుకు వస్తున్నారు. 75పోస్టులకు గాను మిగతా 33పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయక పోవడంతో కార్మికులు పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు.

● అడ్వాన్స్‌లు, ఫ్లేడేలు లేవు...

కాంట్రాక్టు కార్మికులకు దసరా, దీపావళి అడ్వాన్స్, బోనస్ కాంట్రాక్టర్ చెల్లించడం లేదు. ఫ్లేడేలో డ్యూటీ చేసినా కూడా రెస్ట్ ఇవ్వడం లేదు. నెలకు నాలుగు సెలవులు ఇవ్వాల్సి ఉండగా సెలవు దినాల్లో కూడా పని చేయించుకుంటున్నారు. ఆరోగ్యం బాగా లేకపోయినా విధులకు హాజరు కావాలని అంటున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● అడిగితే తొలగిస్తామని బెదిరింపు

అసలు వేతనం రూ.16500 అయితే చేతికి వచ్చేది రూ.11005 మాత్రమే ప్రతీ నెలా కాంట్రాక్టర్ ఖాతాలో జమ చేస్తున్నాడు. ఇందులో కాంట్రాక్టర్ పీఎఫ్ రూ.875, ఈఎస్ఐ రూ.52 జమ చేస్తున్నారు. తమకు వచ్చే చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులకు గురవతు న్నామని, రోజు రోజుకు నిత్యా వసర ధరలు పెరిగిపోతున్నాయని, అసలు వేతనంలో కోత విధిస్తే ఎలా బతకాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పని లేదంటూ వెళ్లగొడుతున్నారని, తాము ఎవరికి చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నామన్నారు.

-వేతనాల్లో కోత విధిస్తున్నారు..

- శనిగరపు చంద్రశేఖర్, ఏఐటీయూసీ అధ్యక్షులు



కార్మికుల చేత మెడికల్ కళాశాలలో పని చేయిస్తున్న కాంట్రాక్టర్ వారికి రూ.16500 వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.4528 కోత విధించి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై గతంలో ప్రిన్సిపాల్‌కు కూడా ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోవడం లేదు.

పనిముట్లు కూడా ఇవ్వడం లేదు...

- అబ్దుల్ కరీం, కార్మిక నాయకుడు



శానిటేషన్ విభాగంలో పని చేసే కార్మికులకు పనిముట్లు ఇవ్వడం లేదు. పెనాయిల్, చీపుర్లు ఇవ్వాల్సి ఉండగా ఆరు నెలలకోసారి కూడా వాటిని ఇవ్వకుండా ఆ బిల్లును కూడా కాంట్రాక్టర్ జేబులో వేసుకుం టున్నారు. శ్రమ దోపిడీకి గురి చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కమాన్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి గ్రామంలో ఆదర్శ నగర్‌లో శనివారం సాయంత్రం ఎస్సై కొట్టెప్రసాద్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడిచేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఆదర్శనగర్‌లోని ఇల్లుటూరి పుల్లయ్య ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో ఎస్సై దాడి చేయగా 8ఇంక్లైన్‌కాలనీకిచెందిన నలుగురు పట్టుబడగా వారివద్ద నుంచి రూ.2450 నగదు, రెండు సెల్‌ఫోన్లు పట్టుబడ్డాయి. స్టేషన్‌కు తరలించారని ఎస్సై కొట్టెప్రసాద్ తెలిపారు.

దాడికి పాల్పడిన సంఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మునిగె బాలమల్లయ్య, అతడి కొడుకులు శివాజీ, విష్ణులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. గ్రామంలోని మునిగె శంకర్ ఈ నెల 21న తన ఇంటి వద్ద మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మునిగె బాలమల్లయ్య గొడవకు దిగాడని పేర్కొన్నారు. ఇద్దరి నడుమ గొడవ చోటు చేసుకోవడంతో శంకర్ సోదరుడు దేవయ్య అక్కడకు చేరుకుని ఎందుకు తిడుతున్నావని బాలమల్లయ్యను ప్రశ్నించాడని తెలిపారు. ఆగ్రహించిన బాలమల్లయ్య, అతని కొడుకులు శివాజీ, విష్ణులు శంకర్, దేవయ్యలను దూషిస్తూ కర్రలతో దాడికి దిగారని పేర్కొన్నారు. అడ్డుగా వెళ్లిన శంకర్ భార్య భాగ్యలక్ష్మి, సోదరి మంజుల, వదిన అమృతలను చితకబాదారని చెప్పారు. బాధితుడు శంకర్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

అస్వస్థతకు గురై ఉపాధిహామీ కూలీ మృతి



లచ్చయ్య (ఫైల్)

చందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులు చేస్తున్న ఓ కూలీ అస్వస్థతకు గురై పనిచోటనే మృతిచెందిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పసుల లచ్చయ్య(60) అనే ఉపాధి హామీ కూలీ కొంతకాలంగా గ్రామంలో ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నాడు. శనివారం గ్రామంలో రోడ్డుపనులకు హాజరయ్యాడు. విరామ సమయంలో భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంటనే తోటికూలీలు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియాఆసుపత్రి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు, కూతురు ఉన్నారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందిస్తామని ఎంపీడీవో ప్రదీప్ కుమార్, ఏపీవో రాజయ్యలు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తంగళ్లపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మామిండ్ల మహేష్ (24) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నాలుగు సంవత్సరాల క్రితం మహేష్ వివాహం చేసుకోగా, ఇప్పటివరకు సంతానం కలగలేదు. దీంతో తీవ్రమనస్తాపం చెంది ఈనెల17వ తేదీన పురుగుల మందు తాగాడు. మహేష్‌ను ఎల్లారెడ్డిపేటలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య కల్పన ఉంది. ఈసంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బోయినపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం మానువాడ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన దాసరి నర్సయ్య(58) తన ఇంటి ఎదురుగా మునగచెట్టు విద్యుత్ తీగల వరకు ఉన్నాయని, కొమ్మలను తొలగించేందుకు చెట్టు పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు నరసయ్య విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని మహిళ బలవన్మరణం

జూలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన మేకల పద్మ(48) జీవితంపై విరక్తిచెంది శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పద్మ భర్త తిరుపతి బతుకుదెరువు కోసం 13ఏండ్ల క్రితం మలేషియా వెళ్ళి 11నెలల క్రితం ఇంటికి వచ్చాడు. నెల రోజుల నుంచి తిరుపతికి జ్వరం వస్తుండగా ఆసుపత్రిలో చూపించగా టీబీ ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. తిరుపతిని మరిన్ని పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. అందుకు తిరుపతి ఒప్పుకోలేదు. భార్య పద్మ అతనికి ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో ఆవేదనకు గురైంది. జీవితంపై విరక్తి చెందిన పద్మ ఇంట్లో పురుగుల మందుతాగి, ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పద్మకు కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ టవర్ ఎక్కిన లారీ డ్రైవర్

పాలకుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్ నగర్ సిమెంటు కంపెనీ సమీపంలోని విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కి శనివారం లారీడ్రైవర్ సార్లనరేష్ హంగామా సృష్టించాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఆర్ స్వామి సంఘటన స్థలానికి చేరుకొని నరేష్‌ను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. నరేష్ నిత్యం సేవించి లారీ నడిపేవాడని, ఇది గమనించిన లారీ అసోసియేషన్ సభ్యులు అతడిని విధుల్లో నుంచి తొలగించారు. దీంతో ఉపాధి పోయిందనే మనస్తాపానికి గురై ఈ సంఘటనకు పాల్పడ్డాడని తెలిపారు.

జైలులో మౌలిక వసతుల పరిశీలన

కరీంనగర్ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలును కరీంనగర్, పెద్దపల్లి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు కె.వెంకటేష్, కె.స్వప్న శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో మాట్లాడి భోజన, న్యాయసేవలు, ఆరోగ్యం, ఇతర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్‌గా న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేనివారికి ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ జి.విజయ్‌డేని, జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేష్, డిప్యూటీ జైలర్లు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్ రెడ్డి, ఎల్ రమేష్, కె.శేఖర్, పెద్దపల్లి కోర్టు సూపరింటెండెంట్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వకేట్‌లు శ్రీనివాస్, కె.సంకీర్తన పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామశివారులో శనివారం ఎస్ఐ అనిల్ కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న పోగుల అజయ్ అనే యువకుడిని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అజయ్ మెట్‌పల్లి వైపు ద్విచక్రవాహనం మీద వెళ్తుండగా పోలీసులను చూసి తప్పించుకొనే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అతడివద్ద నుంచి 300గ్రాముల గంజాయి, ఒకఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పెర్కొన్నారు. గంజాయి తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

ఆటో ట్రాలీ బోల్తా

● 16 మంది మహిళా కూలీలకు గాయాలు ● ముగ్గురి పరిస్థితి విషమం

మంథనిరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన మహిళా కూలీలను తీసుకువెళ్తున్న ఆటో ట్రాలీ బోల్తా పడిన ఘటనలో 16మందికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. భట్టుపల్లి గ్రామానికి చెందిన 20 మంది మహిళ కూలీలు గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తికి చెందిన టాటా ఏసీ ట్రాలీలో భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని మల్లారంలో మిర్చి ఏరడానికి ఉదయం 7 గంటల సమయంలో బయలుదేరి వెళ్యారు. నాగెపల్లి వద్దకు రాగానే ఆటోస్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆటో అదుపు తప్పి మంథని-కాటారం ప్రధాన రహదారిపై బోల్తాపడింది. ప్రమాదంలో గాయపడ్డ వారందరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఇందులో బందెల కిష్టమ్మ, అప్పాల శైలజ, అప్పాల వనితలకు తీవ్రగాయాలు కావడటంతో వారిని కరీంనగర్‌కు తరలించారు. వీరితోపాటు గడ్డి మల్లక్క, సత్తెమ్మ, సమత, ఎర్రమ్మ, కందుల రాజేశ్వరి, పోశక్క, పొలగాని సమ్మక్క, కొమురక్క, జంగా లక్ష్మి, స్రవంతి, కమల, బొద మల్లమ్మలకు మంథనిలో ప్రథమ చికిత్స అనంతరం గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి గాయపడ్డవారికి చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం గోదావరిఖని, కరీంనగర్‌కు తరలించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఐలి ప్రసాద్, అరెల్లి కిరణ్‌గౌడ్‌లు ఆసుపత్రికి వచ్చి బాధితులతో మాట్లాడారు. గోదావరిఖనిలో ప్రభుత్వ ఆసుపత్రి వెళ్ళిన క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందే విధంగా ఏసీపీ మడత రమేష్ ఆసుపత్రికి వచ్చి పర్యవేక్షించారు. మంథని సీఐ రాజు, ఎస్ఐ రమేష్‌లు ఆసుపత్రికి వచ్చి సంఘటన వివరాలు సేకరించారు.



సంఘటన స్థలంలో బోల్తా పడిన ఆటో ట్రాలీ

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

● డ్రైవర్‌కు స్వల్పగాయాలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

కోరుట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం స్కూల్‌వ్యాన్ ఢీకొట్టడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. గౌతమ్‌హైస్కూల్ విద్యార్థులను పాఠశాలకు తరలించేందుకే వెళ్తుండగా ప్రమాదం జరిగింది. హాజీపుర వైపువ్యాన్‌ను తీసుకుపోయే క్రమంలో వ్యాన్‌రోడ్డు ప్రక్కకు ఉన్న ట్రాన్స్‌ఫార్మన్ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడింది.స్థానికులు విద్యుత్ అధికారులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్ అవదూత మారుతి స్వల్పగాయలతో బయటపడగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐశ్రీకాంత్ తెలిపారు. అనంతరం విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు.

పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థిని

శంకరపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసింది. మండలంలోని కొత్తగట్టు గ్రామానికిచెందిన చీర్లంచ ప్రియాంక(34) కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్‌లో చికిత్సపొందుతోంది. శనివారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. ఈ విషయాన్ని ప్రియాంక కూతురు పౌర్ణమికి తెలియకుండా పరీక్షరాసే వరకు వేచి చూశారు. పరీక్షలు రాసిన అనంతరం తల్లి మృతిచెందిన విషయాన్ని చెప్పడంతో సిరిసిల్ల జిల్లాలో పరీక్షరాసిన పౌర్ణమి హుటాహుటిన కొత్తగట్టు గ్రామానికి చేరుకుంది. తల్లి మృతదేహంపై పడి గుండెలు విసేలా రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

● రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

కరీంనగర్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనలో హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు, వడగండ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వడగండ్ల వానతో మామిడి, వరి పంటలు దెబ్బ తిన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వెంటనే అధికారులను పంపించి దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని కోరినట్లు తెలిపారు.

పెద్దపల్లి ట్రాలీ ఆటో ఘటనపై దిగ్భ్రాంతి

పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగేపల్లి బస్‌స్టాప్ వద్ద ట్రాలీ ఆటో బోల్తా ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

● చిన్న హనుమాన్ జయంతి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష

మల్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో వచ్చేనెల11 నుంచి జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కొండగట్టులో ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి జయంతి ఏర్పాట్లను పరిశీలించారు. కోనేరు, దీక్షవిరమణ మండపం, వైజంక్షన్ తదితర ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. జయంతి సందర్భంగా చేపట్టే ఏర్పాట్ల గురించి సమీక్షజరిపారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, దీక్ష విరమణ మండపం వద్ద బారికేడ్ల ఏర్పాటును పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. విద్యుత్ లైట్స్, చలువ పందిళ్లు, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ పారిశుధ్యానికి సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాన్స్‌కో, పంచాయితీరాజ్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాల విజయవంతంకు కృషి చేయాలని అన్నారు. అంతకు ముందు స్వామి వారి సన్నిధిలో కలెక్టర్, ఎస్పీ పూజలు నిర్వహించగా అధికారులు సన్మానించారు. వారివెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఆలయఈవో శ్రీకాంత్‌రావు, డీఎస్పీ రఘు చందర్, డీపీవో మదన్‌మోహన్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అంతరిస్తున్న తాటి వనాలు

● ఉపాధి కోల్పోతున్న కల్లుగీత కార్మికులు



జూలపల్లి శివారులో ఎండిపోతున్న తాటిచెట్లు

జూలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు ఉపాధి ఇస్తున్న తాటి చెట్లు అంతరిస్తున్నాయి. మొగిరోగం సోకి ఎండిపో తున్నాయి. కల్లు విక్రయింతో ఉపాధి పొందుతున్న కల్లుగీత కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయని మండల కల్లుగీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూలపల్లి, కుమ్మరికుంట, కాచాపూర్, వడుకాపూర్, తెలుకుంట తదితర గ్రామా ల్లో తాటిచెట్లకు మొగిరోగంతో క్రమంగా అవి అంతరించి పోతున్నా యని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిచెట్ల సంరక్షణపై అధికారులు దృష్టి సారించకపోవడంతోనే వనాలు అంత రించిపోతున్నాయని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిచెట్లు ఎక్కడం ప్రాణాలకే ప్రమాదం అని తెలిసినా పొట్ట కూటికోసం కల్లుగీయక తప్పడం లేదంటున్నారు. తాటిచెట్లు ఎండి పోతుండడంపై కల్లుగీతకార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర ఉపాధి మార్గాలను చూపాలని వారు కోరుతున్నారు.

కల్లులేక రోజు కూలి గిట్టడంలేదు

- బొంగాని కమలాకర్‌గౌడ్, గౌడసంఘం మాజీ ఉపాధ్యక్షులు గ్రామం,మం, జూలపల్లి



వారసత్వంగా వస్తున్న కల్లుగీత వృత్తిపైనే ఆధారపడి బతుకుతున్న తమ కుటుంబాలకు ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామాల్లోని తాటిచెట్లకు రోగాలు సోకి ఎండిపోతున్నాయి. వాటిని కాపాడేప్రయత్నం ప్రభుత్వం చేపట్టాలి. రోజురోజుకు చెట్లు ఎండిపోయి కల్లులేక రోజువారి కూలి కూడా రావడం లేదు.

ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉపాధిచూపాలి

- అమరగాని మల్లేశం, కల్లుగీత కార్మికుడు గ్రామం, మం. జూలపల్లి.



ఎన్నో ఏండ్లుగా తాటిచెట్లనే ఉపాధిగా చేసుకని తమ కుటుంబాలను వెల్లదీస్తున్నాం. తాటిచెట్లు రోగాలతో ఎండిపోతున్నాయి. ప్రస్తుతం తమకు పూటగడవడం కష్టంగా మారింది. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపి ఆదుకోవాలి.

రాజన్న ఆలయంలో 30 నుంచి

శ్రీరామ నవరాత్రోత్సవాలు



వేములవాడ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో వారం రోజులపాటు ఉగాది, శ్రీరామ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయంలో మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి శ్రీస్వామివారలకు శ్రీసీతారామ చంద్ర స్వామివారలతో పాటుగా పరివార అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10.15 పంచాంగ పూజ సాయంత్రం 4.30 గంటలకు పంచాంగ శ్రవణం, పండిత సన్మానం, రాత్రి 8 గంటలకు స్వామివారి పెద్దసేవ ఊరేగింపును కన్నులపండుగగా చేపట్టనున్నారు. అంతేకాకుండా 4వ తేదీ శుక్రవారం నుంచి 6వ తేదీ ఆదివారం వరకు మూడు రోజులపాటు భక్తోత్సవం, హవనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

6న సీతారాముల కల్యాణం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సీతారామచంద్రుల దివ్య కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా ఏప్రిల్ 6వ ఆదివారం నిర్వహించనున్నారు. అనంతరం వైభవంగా స్వామివారి రథోత్సవం రాత్రి డోలోత్సవం నిర్వహించనున్నారు.

ఇంటర్ తర్వాత వివిధ కోర్సులు



విద్యార్థులకు 113 కోర్సులను సూచించిన సీబీఎస్ఈ

చొప్పదండి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు ఇంటర్ తరువాత ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతు న్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లోనూ కంప్యూటర్ సైన్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంటర్ తరువాత ఇంజనీరింగ్‌తో పాటు 113 కోర్సుల జాబితాను సీబీఎస్ఈ విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం బుక్ లెట్‌ను రూపొం దించింది. ఇంజనీరింగ్ కోర్సు, ఫిషరీస్, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, చార్టెడ్ అకౌంటెంట్ లాంటి అనేక రంగాలలో ఉద్యోగాలను కల్పించే కోర్సులు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఇంటర్ తరువాత అందుబాటులో ఉన్న వివిద డిప్లమా, డిగ్రీ కోర్సుల వివరాలు విద్యార్థుల కోసం...

● **ఇంజనీరింగ్ కోర్సులు:**



ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ ఇంజనీరింగ్, సెరామిక్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మ్యాన్యుఫ్యాక్చ రింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజ నీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, పాలీమర్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్, మెటాలర్జీ, మెటరాలజీ, రోబోటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్

● **మేనేజ్‌మెంట్ కోర్సులు:**

బ్యాంక్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంట్స్, చార్టర్డ్ అకౌంటెన్సీ చార్టర్డ్ ఫైనాన్షియల్ అనాలిసిస్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్



● **ఇతర కోర్సులు**

ఆస్ట్రోనమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్స్ బయోలాజికల్ సైన్స్, బయోటెక్నాలజీ, ఎర్త్‌సైన్స్ /జాగ్రఫీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిషరీస్, ఫ్లోరికల్చర్/హార్టికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, ఓషియనోగ్రఫీ, స్టాటిస్టికల్ సైన్స్, వైల్డ్ లైఫ్ బయాలజీ, జువాలజీ, ఆంత్రోపాలజీ, ఆర్కియాలజీ, ఆర్ట్ రిస్టోరేషన్, క్యూరేషన్, ఎడ్యుకేషనల్/వొకేషనల్ స్కూల్ కౌన్సిలర్, మాన్యుమెంట్స్ అండ్ స్కల్ప్చర్ రిస్టోరేషన్, మ్యూసియాలజీ, సోషల్ వర్క్, స్పెషల్ ఎడ్యుకేటర్, లా, అడ్వర్టైజింగ్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, పబ్లిక్ రిలేషన్స్, ఆర్ట్ డైరెక్షన్, కొరియోగ్రఫీ, డైరెక్షన్, ఫిల్మ్ /డ్రామా ప్రొడక్షన్, ఫైన్ ఆర్ట్స్, పర్ఫామింగ్ ఆర్ట్స్, వోకల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, యానిమేషన్, సినిమాటోగ్రఫీ, కమ్యూనికేషన్ డిజైన్, డిజైన్, గ్రాఫిక్ డిజైనింగ్, ఫోటోగ్రఫీ, యాక్చురియల్ సైన్సెస్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, కార్పొరేట్ ఇంటెలిజెన్స్, డిటెక్టివ్, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషియన్, ఫారిన్ లాంగ్వేజెస్, హోమ్ సైన్స్, ఇంటీరియర్ డిజైనింగ్, లిబరల్ స్టడీస్, లైబ్రరీ సైన్సెస్, మాంటెస్సరీ టీచింగ్, న్యూట్రీషియన్ అండ్ డైటెటిక్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, టూరిజం అండ్ ట్రావెల్.

● **వైద్య సంబంధ కోర్సులు:**



ఆయుర్వేద (బీఏఎంఎస్), డెంటల్ బీడీఎస్, హోమియోపతి, న్యాచురోపతి, ఫార్మసీ, సిద్ధ, యునానీ, ఫిజియోథెరపీ, రిహ్యాబిలి టేషన్ సైకాలజీ, రిహ్యాబిలిటేషన్ థెరపీ, ఫిజియోథెరపీ, రిహ్యాబిలిటేషన్ సైకాలజీ, రిహ్యాబిలిటేషన్ థెరపీ, వెటర్నరీ సైన్సెస్, స్పీచ్ లాంగ్వేజ్ అండ్ హియరింగ్

బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల ఫీజుల

బకాయిలు విడుదల చేయాలి

- బీఏఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు సంబంధించిన ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో స్కూళ్లను ప్రభుత్వమే నడిపించాలని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రాష్ట్ర కార్యదర్శి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం రాష్ట్రంలో 180 బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ విద్యార్థులు 18వేలు, ఎస్టీ విద్యార్థులు 7వేల మంది మొత్తం 25వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో ఆనాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. 17వేల మంది అణచి వేతకు గురైన వర్గాలకు సంబంధించిన వారు, ఎక్కువ మంది జోగిని వ్యవస్థకు గురైన వారి పిల్లలు, వ్యవసాయ కూలీల పిల్లలు లబ్ధిపొందారని పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి 20వేల రూపాయలు చెల్లించే వారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఈ సీట్ల సంఖ్యను 25 వేలకు పెంచడమే కాకుండా రూ.20 వేల మొత్తాన్ని రూ.42 వేలకు పెంచారని పేర్కొన్నారు. ఏటా రూ.100 కోట్ల బడ్జెట్ రిలీజ్ చేశారని, ఇందులో రూ.80 కోట్లు హాస్టళ్లకు రూ.20 కోట్లు డేస్కాలర్ విద్యార్థులకు నిధులు విడుదలయ్యేవని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లకు 200 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉండగా మంత్రులు, ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉన్న స్కూళ్లకు రూ.50 కోట్లు మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. మిగతా 150 కోట్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. వెంటనే 150కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తదుపరి కార్యాచరణ చేపడుతామన్నారు.

కొండగట్టులో చలువ పందిళ్ల జాడేదీ?

మల్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి వేసవిలో భక్తుల సౌకర్యార్థం కొండగట్టు అంజనేయస్వామి ఆలయ పరిధిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తుండగా ఈ సారి ఇంకా వాటి జాడ కనిపించడం లేదు. ఇటీవల భానుడి ప్రతాపంతో ఎండలు మండుతుండగా భక్తులు అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఆలయ ఆవరణంలో నడవడానికి కొంత మేర మ్యాట్ వేయగా చలువ పందిళ్లు మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రతి ఏటా టెండర్ ద్వారా సుమారు రూ.10లక్షల పైచిలుకుతో చలువ పందిళ్లు వేస్తుండగా ఇప్పటి వరకు ఏర్పాటు కాకపోవడంతో మధ్యాహ్న సమయంలో ఆలయ ఆవరణలో భక్తులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. విద్యాసంస్థలకు త్వరలోనే వేసవి సెలవులు రానుండడం, హనుమాన్ జయంతి ఉత్సవాలు సమీపిస్తుండడంతో భక్తుల రాక పెరుగుతుంది. టెండర్ ప్రక్రియ పూర్తి అయినప్పటికీ ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు అంటున్నారు. త్వరలో చలువ పందిళ్ల పనులు ప్రారంభం అవుతాయని దేవస్థానం పర్యవేక్షకులు సునీల్ తెలిపారు.

ఆలయంలో భక్తుల రద్దీ

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వందలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయం

ధర్మపురిలో ఘనంగా ఉగ్ర నారసింహుడి ఏకాంతోత్సవం



ధర్మపురిలో ఉగ్ర నారసింహస్వామి ఏకాంతోత్సవం



శేషప్ప కళావేదికపై చిన్నారుల ప్రదర్శన

● **ముగిసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు**

ధర్మపురి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (ఉగ్ర) వారల ఏకాంతోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టు ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. దీంతో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అంతకు ముందు శేషప్ప కళావేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న గొంగళ్లు

● ఆదరణ కోల్పోవడంతో నేసే వారు కరువు

కొడిమ్యాల, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్, నమిలికొండ గ్రామాలు 20 సంవత్సరాల క్రితం గొంగళ్ల నేతకు ప్రసిద్ధి చెందాయి. కానీ ప్రస్తుతం గొంగళ్లకు ఆదరణ తగ్గింది. గొంగళ్లకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లోకి పలు రకాల బ్లాంకెట్లు రంగ ప్రవేశం చేయడంతో గొంగళ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. మండలంలోని పూడూర్, నమిలికొండ గ్రామాల్లో గతంలో సుమారు 50 మంది గొంగళ్లను నేస్తూ జీవనోపాధి పొందేవారు. ప్రస్తుతం ఆదరణ కోల్పోవడంతో గొంగళ్లు నేసే వారు కూడా కరువయ్యారు. ప్రస్తుతం పూడూర్ గ్రామానికి చెందిన రొడ్డ అంజయ్య అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నుంచి గొర్రె ఉన్నితో తయారు చేసిన గొంగళ్లను తీసుకువచ్చి పసుపు, ఎరుపు రంగులలో కడ అంచు కట్టి విక్రయిస్తున్నాడు. డిజైన్‌ను బట్టి 300 రూపాయల నుంచి 3వేల రూపాయల వరకు ఒక్కో గొంగళి ధర పలుకుతోంది. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ మల్లన్న పట్నాల సమయంలో సుమారు లక్ష రూపాయల విలువైన గొంగళ్లు అమ్ముడు పోతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలకు వెళ్లి అక్కడ గొంగళ్లను అమ్ముకునే వారికి హోల్‌సేల్‌గా ఇచ్చివస్తాన్నారు.



సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

-రొడ్డ అంజయ్య, పూడూర్ గ్రామం



గొంగళ్ల తయారీకి కుర్మలకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను మంజూరు చేయాలి. 50 సంవత్సరాలు దాటిన కుర్మలకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.



అంచు కట్టుతున్న మహిళలు

26,27 తేదీల్లో వేములవాడ, ధర్మపురి ప్రాంతాల్లో బీసీ కమిషన్ అధ్యయనం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తమ కులాల పేర్లను మార్చాలని వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలను స్వీకరించిన బీసీ కమిషన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు వేములవాడ, ధర్మపురి ప్రాంతాల్లో పర్యటించనున్నది. బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలతో కూడిన అధికారుల బృందం ఈనెల 26న వేములవాడ, 27న సిరిసిల్లలో వంశరాజ్, దొమ్మర కులస్థుల నివాస ప్రాంతాలను సందర్శించనున్నారు. అదే రోజున జగిత్యాల, ధర్మపురి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీలకు

ఉమ్మడి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు



ఖో-ఖో పోటీలకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు కట్ట సంతోష్ (చామనపల్లి జడ్పీహెచ్ఎస్), వీచు జ్యోతి(బొమ్మనపల్లి జడ్పీహెచ్ఎస్), జి రేణుక(కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్), మార్గం నవీన్(నంచర్ల జడ్పీహెచ్ఎస్), వాసం నవీన్‌కుమార్(భూషణ్‌రావుపేట జడ్పీహెచ్ఎస్)లు పాల్గొంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో విశేష ప్రతిభచాటిన వీరు అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీరిని కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వి సూర్యప్రకాశ్, ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ సభ్యులు సీఐ కుమారస్వామి, ఎస్ఐ రమేష్, సీహెచ్ తిరుపతిరెడ్డి, ఏ రవీందర్, ఎస్కే మోయినుద్దీన్, ఆర్ తిరుపతిరెడ్డి, పెద్దపల్లి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ కుమార్, డాక్టర్ వి కుమారస్వామి, రైల్వే ఖో-ఖో కోచ్ ఇ నరేష్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

రసాయన శాస్త్రంతో ఉపాధి అవకాశాలు

గణేశ్‌నగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రసాయన శాస్త్ర అధ్యయనంతో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని డాక్టర్ కే కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీ ఫార్మా లిమిటెడ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కే కిరణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తూ లక్ష్య సాధన దిశగా పయనించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి నితిన్, రసాయన శాస్త్ర విభాగాధిపతి మేజర్ రేళ్ల సంజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దూర్‌లో తాగునీటి కటకట..

● నెల రోజుల క్రితం కాలిపోయిన విద్యుత్ మోటారు
● వ్యవసాయ బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు
● ఫిర్యాదులు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు



సిరిసిల్ల పెద్దూర్‌లో దుప్యానాయక్ తండాలో వ్యవసాయ బోరునుంచి వేసుకున్న పైప్‌లు

తండాలో కాలిపోయిన బోర్‌మోటర్

సిరిసిల్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన బోర్లు చెడిపోవడంతో నెల రోజులు నుంచి పెద్దూర్ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామాన్ని మున్సిపల్‌లో విలీనం చేసిన సమయంలో 8వ వార్డు, 9వ వార్డులుగా విభజించారు. అయితే పెద్దూర్ గ్రామంతోపాటు 9వ వార్డులోని దూప్యానాయక్ తండా, మాలపల్లె, తుర్కకాశీకాలనీ, బాబాజీ కాలనీలలో ఉన్న బోర్‌మోటార్లు నెలరోజుల క్రితం కాలి పోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. బోర్‌మోటార్‌కు మరమ్మతులు చేయించాలని ఇద్దరు మాజీ కౌన్సిలర్‌లతోపాటు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడం లేదని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలిపోయిన బోర్‌మోటార్‌ను బాగుచేయించి నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

● తాగునీటి బావుల పైప్‌లైన్‌లను బాగు చేయాలి పెద్దూర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో తాగునీటిని అందించేందుకు పక్కనున్న మానేరు వాగులో జీపీ నిధులతో రెండు బావులతో పాటు బోర్లను వేశారు. మంచినీటి ట్యాంక్‌లకు పైప్‌లైన్‌లను వేసి నీటిని అందించారు. మిషన్ భగీరథ రావడంతో ఆ బావులు, బోర్లను మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆ పైప్‌లైన్‌లను దొంగిలించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మానేరు వాగులోని బావులు, బోర్లకు కొత్తగా పైప్‌లైన్‌లను వేసి నీళ్లు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బోరు కాలిపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు..

- భూక్య విజయ, దూప్యానాయక్ తండా



పెద్దూర్ శివారులోని దూప్యానాయక్ తండాలో తాగునీరు అందించే బోరు నెలరోజుల క్రితం కాలిపోయింది. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. రోజు ఉదయం, సాయంత్రం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. మున్సిపల్ అధికారులు స్పందించి కాలిపోయిన బోర్‌లను మరమ్మతులు చేయించాలి.

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు..

- షేక్ అలీబీ, తుర్కకాశీ కాలనీ, పెద్దూర్



పెద్దూర్ శివారులోని తుర్కకాశీ కాలనీలో మిషన్ భగీరథ నీటి కోసం ట్యాంక్‌ను నిర్మించి ఇంటింటికి నల్లాలను ఏర్పాటు చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి ఎద్దడిని తీర్చాలి.

●సంక్షిప్తంగా

కరీంనగర్ టౌన్: ఉపాధ్యాయులపై డీఈవో జనార్దన్‌రావు దురుసుప్రవర్తనను మార్చుకోవాలని లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేస్తామని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవాల నరహరి, తూముల తిరుపతి ఒక ప్రకటనలో హెచ్చరించారు.

కరీంనగర్ కల్చరల్ : నగరంలోని గాంధీ రోడ్ టీటీడీ కల్యాణ మండపంలో గుండ రాధాకిషన్ అయ్యప్ప దాసన్, భక్త బృందం, వైదికుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం సుదర్శనహోమం నిర్వహించారు.

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ వాసాల వరప్రసాద్ రచించిన 'వెలుగుపూల ఆకాశం' కవితా సంపుటిని ఆదివారం వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

గణేశ్‌నగర్ : ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నుస్తులాపూర్ కరీంనగర్ డెయిరీని క్షేత్రస్థాయిలో సందర్శించారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి మేజర్ రేళ్ల సంజీవ్ తదితరులు ఉన్నారు.

● టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశం మందిరంలో శనివారం సోలార్ పవర్‌పై సమావేశం నిర్వహించారు. ఎస్ఈ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, లీడ్ బ్యాంకు అధికారులు, రెడ్కో అధికారులు వినియోగదారులకు అవగాహన కల్పించారు.

● వాగేశ్వరీ, డిగ్రీ పీజీ కళా శాలలో ఎన్ఎస్ఎస్, లీడ్ ఇండియా నేషన ల్ క్లబ్ సంయుక్తంగా షహీదీ దివస్ సంద ర్భంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వ హించారు. అంతకుముందు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

సుభాష్‌నగర్: విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా ఎంపికైన అభ్యర్థులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని 2006 క్వాలీఫైడ్ లైన్‌మెన్ అభ్యర్థులు కోరారు. శనివారం డీఆర్‌వోకు వినతిపత్రం అంద జేశారు.

ఆయుష్మాన్ భారత్ అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం కరీంనగర్ మండలం చామనపల్లిలో మెడిసిటీ ఆస్పత్రి యాజమాన్యం 3 రోజుల పాటు నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఆయుష్మాన్ భారత్‌లో రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్స చేయించుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ స్కీం ద్వారా సేవలందిస్తోందని, ప్రైవేటు ఆస్పత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆస్పత్రులు నిరాకరిస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలని కోరారు. అంతకుముందు వైద్యశిబిరం నిర్వహించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు మొదలు సర్జరీల దాకా



కార్యక్రమంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

ఉచితంగా సేవలందిస్తున్న మెడిసిటీ ఆస్పత్రి యాజమాన్యం సేవలను అభినందించారు. మెడిసిటీ ఆస్పత్రి సీఈవో ఇనిష్ మర్చంట్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నగర మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న సేవలను బండి సంజయ్ కుమార్ అభినందించారు. ఎంపీడీవో సంజీవరావు, ప్రత్యేకాధికారి జగన్మోహన్ రెడ్డి, కార్యదర్శి మహేందర్, ఎఫ్ఎ ఆంజనేయులు, ఆర్‌పి సాయిలు పాల్గొన్నారు

భగత్‌నగర్: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురువు, సుకుదేవ్ వర్ధంతి సందర్భంగా నీఫా ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం బ్రోచర్‌ను బండి సంజయ్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాగేశ్వరీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహకారంతో 60 మంది రక్తదానం చేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ కెప్టెన్ మధుసూదన్‌రెడ్డి, ఎన్‌వైపీ రాష్ట్ర అధ్యక్షుడు యాదవరాజు, మాజీ కార్పొరేటర్ నిఫా రాష్ట్ర సెక్రెటరీ శ్రీనివాస్, నీఫా అధ్యక్షుడు తిరుపతి, నరేష్ పాల్గొన్నారు.

ఫోర్‌మెన్ కమిటీ నివేదిక మేరకు నిర్ణయం

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో బదులు ఉద్యోగులకు సంబంధించి ప్రత్యేక ఫోర్‌మెన్ కమిటీ ఏర్పాటు చేశామని, ఆ కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ అన్నారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో బదులు కార్మికులతో ఫోర్‌మెన్ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిటీ సమావేశానికి విచారణ కోసం నోటీసులు జారీ చేసిన బదులు ఉద్యోగులు హాజరైనట్లు తెలిపారు.

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

భగత్‌నగర్, మార్చి 22 (ఆంధ్ర జ్యోతి): అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీనివాస్, చింతల శ్రీనివాస్‌రెడ్డి, దుబాసి కుమార్, ఎర్రం కనకారెడ్డి, జేరిపోతుల వాసు, చిట్కూరి బీరయ్య, బేతి సుధాకర్‌రెడ్డి, వెన్నం రజితరెడ్డి, సంది తిరుపతిరెడ్డి మాడుగుల మమత, శ్రీమతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌కు విద్యార్థుల ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్/ భగత్‌నగర్/ గణేశ్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ -2025 రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక గురుకుల కళాశాలకు చెందిన బీకాం మొదటి సంవత్సరం విద్యార్థిని గుర్రం అమూల్య ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.మాలతి ప్రకటనలో తెలిపారు.

● అల్ఫోర్స్ మహిళా డిగ్రీకళాశాల విద్యార్థిని కనక్‌ముండాడ ఎంపికవగా శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయికి ఎంపికవడం గర్వకారణమన్నారు.

● వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో టీబీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థిని లావణ్య ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా లావణ్యను కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, మహేష్ అభినందించారు.

అట్టహాసంగా 'మానేరు' వార్షికోత్సవం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మానేరు విద్యాసంస్థల 39వ వార్షికోత్సవం అట్టహాసంగా సాగింది. శనివారం రాత్రి స్థానిక పద్మనగర్ మానేరు సీబీఎస్ఈ పాఠశాల ఆవరణలో నిర్వహించిన వేడుకలను ఎస్‌యూ వైస్ చాన్సలర్ ఉమేశ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో 39 ఏళ్లుగా మానేరు విద్యాసంస్థలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయన్నారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ 1986లో 80 మంది విద్యార్థులతో ప్రారంభమైనట్లు, నేడు వేలాది మందికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య నందిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, మాజీ కార్పొరేటర్లు తుమ్మల రమేశ్‌రెడ్డి, గుగ్గిళ్ల జయశ్రీ, మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, అనంతాచార్య పాల్గొన్నారు.

పూర్వవైభవం చేకూరేనా?

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల వరకు రెట్టింపు చేయడం ద్వారా గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులను గెలిపించుకోవాలని ఆ పార్టీ భావిస్తున్నది. కేటీఆర్, హరీశ్‌రావు హాజరయ్యే ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కీలకబాధ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కడ బీఆర్ఎస్ సభలు జరిగినా లక్ష మందికి తగ్గకుండా హాజరయ్యే ఆనవాయితీ ఉండేది రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ఏ సభ జరిగినా ఇక్కడి నుంచే వేలాదిగా తరలివెళ్లి పార్టీకి సంఘీభావం ప్రకటించేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతమంది ఈ సన్నాహక సమావేశానికి హాజరవుతారు.. వరంగల్‌లో జరిగే సిల్వర్‌జూబ్లీ వేడుకలకు ఎంత మంది తరలివెళ్తారు.. బీఆర్ఎస్ కార్యాచరణ ఏ విధంగా ఉండబోతున్నది.. అన్న అంశాలను రాజకీయవర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా శనివారం హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని సీపీ కలిశారు.

మున్సిపల్ కమిషనర్‌కు స్త్రీ శక్తిమాన్ పురస్కారం

కరీంనగర్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ హుజూరాబాద్ సంయుక్తంగా శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్‌కి స్త్రీ శక్తిమాన్ పురస్కారం అందజేశారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు దయాకర్, అకాడమి అధ్యక్షుడు కృపాదానం పాల్గొన్నారు.

పట్టణ ముద్రణ వ్యాపార సంఘం ప్రమాణ స్వీకారం

కరీంనగర్ అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణ ముద్రణ(ప్రింటింగ్‌ప్రెస్)వ్యాపార సంఘం నూతన కమిటీ కార్యవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. సంఘం అధ్యక్షుడిగా నలువాల ప్రకాశ్‌పటేల్, గౌరవ అధ్యక్షుడిగా బుడికె నాగభూషణం, ప్రధానకార్యదర్శిగా బండారి నరేందర్, కోశాధికారిగా కొండపల్లి శ్రవణ్‌కుమార్, సలహాదారులుగా మాజీకార్పొరేటర్ నలువాల రవీందర్, గాలిపెల్లి కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా జక్కని ప్రభాకర్, కొత్త శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా జడల స్వామి, కార్యవర్గ సభ్యులుగా కూనారపు స్వామి, కోరె సంజీవ్, కూన సంతోష్‌కుమార్, శ్రీరామోజు శ్రీనివాసరావు, వైద్య శాంతకుమార్, బద్రి సుధాకర్ ప్రమాణస్వీకారం చేశారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు సిద్ధార్థ విద్యార్థి ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థి సాయి చైతన్య ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత దాసరి శ్రీపాల్‌రెడ్డి అభినందించారు.

నేడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోభవన్‌లో ఉదయం 10 గంటలకు సంఘం సర్వసభ్య సమావేశం, అనంతరం ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయసంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, కృష్ణమూర్తి ప్రకటించారు.

వాగేశ్వరీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

భగత్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బద్దిపల్లి, కమాన్‌పూర్ గ్రామాల్లో వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. కరీంనగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోడూరు శ్రీనివాస్, బీజేపీ నాయకుడు నరేందర్‌రెడ్డి, వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుందేటి సత్యనారాయణ, తాండ్ర శ్రీనివాస్, తాండ్ర నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ విస్తృతస్థాయి సమావేశం

కరీంనగర్ లీగల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాల పల్లిలో శనివారం జిల్లా కాంగ్రెస్ లీగల్‌సెల్ చైర్మన్ కల్లెపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో లీగల్ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కోర్టులో ఖాళీ కాబోతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల విషయంలో అర్హత కలిగిన కాంగ్రెస్ లీగల్ సెల్ కార్యకర్తలను పరిగణలోకి తీసుకొని సంబంధిత మంత్రులతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

ప్రజాసేవ అదృష్టంగా భావించాలి

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవలందించడం అదృష్టంగా భావించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్ శిక్షణ పూర్తి చేసుకొని హైదరాబాద్‌కు వెళ్తున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకు సాధించిన ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ విభిన్న సంస్కృతీసంప్రదాయాలు, భాషలు కలిగిన జిల్లాకు రావడం, ఇక్కడ శిక్షణపొందడం భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, ఆర్డీవో మహేశ్వర్ అధికారులు పాల్గొన్నారు.


అజయ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

విగ్రహాల ఆవిష్కరణకు సహకరించాలి

భగత్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు సహకరించాలని తిమ్మాపూర్ జేఏసీ నాయకులు కోరారు. శనివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. విగ్రహాల ముసుగులు తొలగించాలని రిలే దీక్షలు చేస్తున్నామన్నారు.ఆర్టీసీ అధికారులు బందోబస్తు పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. జగదీశ్వరాచారి, శంకర్, రాజయ్య, మాజీ మేయర్ సునీల్‌రావు, అజయ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

తిమ్మాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి యాజమని తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతని నిర్మించుకోవాలని జిల్లా భూగర్భజలాధికారి శ్యాంప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ నీటిదినోత్సవం సందర్భంగా జిల్లా భూగర్భజలశాఖ నేతృత్వంలో రైతువేదికలో రైతులు, నీటి వినియోగ దారులకు భూగర్భజలాల సంరక్షణ, పెంపుదలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా భూగర్భ జలాధికారి శ్యాంప్రసాద్‌లాల్, జిల్లావ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పొలాల్లో ఫారంపాండుల నిర్మాణం, చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టాలని తెలి పారు. తక్కువ నీటిని వాడుకొని అధికదిగుబడి వచ్చే వ్యవసాయ పద్ధతులపై రైతులు ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అదనపు సంచాలకులు శ్రీధర్, తిమ్మాపూర్, మానకొండూర్ వ్యవసాయాధికారులు సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆదరణ సేవాసమితి అధ్యక్షురాలు కర్రె పావని పాల్గొన్నారు.

సంక్షేమంపై ప్రశ్నిస్తే అరెస్టులు..

గంగాధర/రామడుగు/శంకరపట్నం/వీణవంక/చిగురుమామిడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమానికై ప్రశ్నిస్తే అక్రమఅరెస్టులు చేస్తున్నారని బీఆర్‌ఎస్వీ జిల్లాకోఆర్డినేటర్ ద్యావ మధుసూధన్‌రెడ్డి, తాటికొండ సందీప్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్‌ఎస్వీ రాష్ట్రకమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చింది. ఈసందర్భంగా హైదరాబాద్‌కు వెళ్తారన్న ఉద్దేశ్యంతో ముందస్తుగా విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు

సైదాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం (ఎస్ఎంఏఎం) కింద రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను అందించడానికి మహిళా రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వైదేహి ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 50 శాతం రాయితీపై అందించ డానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఆసక్తిగల రైతులు దరఖాస్తులను మండల వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

ఎల్ఆర్ఎస్ చెల్లింపులను వేగవంతం చేయండి

జమ్మికుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ చెల్లింపులను వేగవంతం చేయాలని వార్డు ఆఫీసర్లకు కమిషనర్ మహమ్మద్ అయాజ్ సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ చెల్లించని వారు ప్రస్తుతం 25శాతం మినహాయింపుతో చెల్లించవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతాం

చిగురుమామిడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో వాగ్ధానాలు ఇచ్చి విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రైతుఉద్యమాల ద్వారా ఎండగడుతామని మండల రైతుసంఘం అధ్యక్షుడు కోమటిరెడ్డి జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా రైతుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి ఆ ప్రాంతానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

పూర్తి రుణమాఫీ చేయని ప్రభుత్వం

చిగురుమామిడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్న రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చెయ్యలేదని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బండ రాజిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు పొనగంటి కేదారి అన్నారు. శనివారం మండల కేంద్రాంలో ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

ఇల్లందకుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గుడెపు సారంగపాణి శనివారం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సదయ్య, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

హుజూరాబాద్: పట్టణంలోని జమ్మికుంటరోడ్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జూలపల్లి కమల కుటుంబసభ్యులను కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వీణవంక: మండలంలోనిఇప్పలపల్లి గ్రామానికిచెందిన బీజేపీసీనియర్ నాయకుడు ముదిగంటి విద్యాసాగర్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి ఇటీవలమృతిచెందగా వారికుటుంబాన్ని మంత్రి బండిసంజయ్ కుమార్ పరామర్శించారు.వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు.


మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న సారంగపాణి తదితరులు

సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి: సీపీఎం

హుజూరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రజలు నిలదీయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్‌లో నిర్మించిన 500 డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఏళ్లు గడుస్తున్న ఎవరికి ఇళ్లు కేటాయించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారయ్యాయన్నారు. 15రోజుల్లో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే అర్హులైన లబ్ధిదారులతో ఇళ్లను స్వాధీనం చేసుకొంటామన్నారు.


మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్, నాయకులు చంద్రయ్య, చేరాలు, రత్నాకర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులపై ఆరోపణలు సరికాదు

తిమ్మాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అక్రమంగా ఎల్‌వోసీలు ఇప్పించి ఆర్థికప్రయోజనం పొందేలా చేసినట్లు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తమ ఆసుపత్రులపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని సురక్షా హాస్పిటల్ ఎండీ హరిప్రసాద్‌రెడ్డి(భూపాలపల్లి) అంకిత్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా వారు బహిరంగలేఖను మీడియాకు విడుదలచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం నిమ్స్‌కు మాత్రమే ఎల్‌వోసీలు మంజూరు చేస్తుందని, ప్రైవేటు ఆసు పత్రులకు ఎల్‌వోసీలు ఇవ్వడం లేదన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో సబ్ స్టేషన్ నిర్వహణలో భాగంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్‌వన్, రూరల్ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11:30 వరకు వావిలాలపల్లి, జెండాగద్దె ఏరియా, మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5:30 వరకు జగిత్యాల్ రోడ్, వివేకానంద స్కూల్ ఏరియా, హోటల్ ప్లాట్ ఫారమ్ ఏరియా, రూరల్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు శాతవాహన యూనివర్సిటీ, మధ్యాహ్నం 12 గంట నుంచి ఒంటి గంట వరకు ఎలగందల్, ఆసీఫ్ నగర్, బావుపేట, చింతకుంట, కమాన్‌పూర్, మల్కాపూర్, బద్దిపల్లి, నాగులమల్యాల, గ్రానైట్ పరిశ్రమల ప్రాంతాల్లోఅంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రేపు చిగురుమామిడి మండలంలో..

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని ఉల్లంపల్లి, సుందరగిరి, కొండాపూర్, బంజేరుపల్లి గ్రామాల్లో ట్రాన్స్‌ఫా ర్మర్లను బిగింపు సందర్భంగా సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 7 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ శనివారం తెలిపారు.

రైతు సంఘం మండల అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి

చిగురుమామిడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైతు సంఘం మండల అధ్యక్షుడిగా ఓగులాపూర్ గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ కోమటిరెడ్డి జైపాల్‌రెడ్డిని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కాంతల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా అందె తిరుపతి, ప్రధానకార్యదర్శిగా గోలి బాపురెడ్డి, తదితరులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరీం నగర్‌లోని వైశ్య భవన్ సమావేశ మందిరంలో శనివారం మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు, జిల్లా ఆర్య వైశ్య మహా సభ అధ్యక్షుడు కన్న కృష్ణ, సర్వోదయ సేవా సమితి సహాధ్యక్షుడు గంజి స్వరాజ్‌బాబు సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు.



వీణవంక పోతిరెడ్డిపల్లిలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

గణేశ్‌నగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. కో ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ తిరుపతి, డాక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

భగత్‌నగర్ : కొత్తపల్లిమండలం నాగులమల్యాలలో శనివారం జల దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధుకర్‌రావు, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ ఉషారాణి, వ్యవసాయ అధికారి కృష్ణ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్/వీణవంక : ప్రపంచ నీటిదినోత్సవాన్ని పుర స్కరించుకొని బాలవికాస సంస్థ ఆధ్వ ర్యంలో హుజూరాబాద్ మండలంలోని సిర్స పల్లి, వీణ వంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యా ర్థులు ర్యాలీ నిర్వహించారు. నీటి ప్రాముఖ్యతపై బాలవికాస సంస్థ సభ్యులు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు నీటి ప్రతిజ్ఞ చేశారు.

అవీ.. ఇవీ..

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ మైదానంలో నవక్రాంతి ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎర్త్ అవర్ కార్యక్రమం నిర్వహించారు.సంస్థ నిర్వాహకుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, భూతాపాన్ని తగ్గించడానికి ఏటా మార్చి 22న గంటపాటు విద్యుత్, ఎలక్ట్రానిక్ పరికరాలు ఆఫ్ చేసే కార్యక్రమాన్ని 2007 నుంచి కొనసాగిస్తున్నామన్నారు.

హుజూరాబాద్: పట్టణశివారులోని ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో రవిరాజేశ్వర మల్టీస్పెషాలిటీ దంతవైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు అమృత్, మహేష్ విద్యార్థుల దంతాలను పరీక్షించి సూచనలు చేశారు.

వీణవంక: అక్రమ అరెస్టులు నిరసిస్తూ శనివారం మండలకేంద్రంలో సీఐటీయూ నాయకులు రోడ్డుపై నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పిల్లి రవి మాట్లాడుతూ ధర్నాకు వెళ్లకుండా అక్రమ అరెస్టులు చేశారని మండిపడ్డారు.

-మండల కేంద్రంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మానకొండూర్: ఉపాధిహామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఆరువారాల వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని అన్నారం గ్రామంలో ఉపాధిహామీ కూలీలు చేస్తున్న నీటి నిల్వల గుంతల పనులను శనివారం ఆయన సందర్శించారు.

-మండలంలోని గట్టుదుద్దెనపల్లి, నిజాయితీగూడెం గ్రామాల్లో కరీంనగర్ ప్రాంతీయ పశువైద్య శిక్షణాకేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్యశిబిరం జరిగింది. ఎదకురాని, చూడికట్టని, చూడి నిలవని పశువులకు మందులను వేశారు.

గంగాధర: మండలంలోని మంగపేట మసీద్‌కు కొత్తజయపాల్‌రెడ్డి రూ.30వేల విలువైన మెకొనిస్టం అందించారు.

-కరాటేతో విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో 150 మందికి బెల్టు టెస్టులను నిర్వహించి ఒకినోవా చీఫ్ ఎగ్జామినర్ వసంత్ కుమార్ బెల్టులను ప్రదానం చేశారు.

గన్నేరువరం: కాంగ్రెస్ బలోపేతానికి సేవలందించిన వారికే పదవులు దక్కుతాయని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ అన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ విశిష్ట సేవలను అందిస్తున్నారన్నారు.